

మార్కెట్‌లో తాటి ముంజలు

వేసవిలో ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. ఈ సారి ఇవి నాలుగు నెలలు ముందుగా చలి కాలంలోనే మార్కెట్‌లోకి వచ్చాయి. 8లో▸



అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళా వేదికపై బుధవారం తాడిపత్రికి చెందిన సీతారామాంజనేయ బృందం భక్తిగీతాలకు నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,626.09
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 80.103
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 290
అవుట్ ఫ్లో	: 9,073

న్యూస్‌రీల్

శ్రీశైలంలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులకు పూజలు చేసి ప్రారంభిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయానికి ఎదురుగా రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపి పనులు మొదలుపెట్టారు. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తారు రోడ్డు పనులు చేస్తారు. ప్రస్తుతం ఉన్న 30అడుగుల రహదారికి రెండువైపుల కుడి, ఎడమవైపులలో 15అడుగుల మేర విస్తరింపజేసి మొత్తం 60అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మిస్తున్నారు. రహదారి పూర్తయిన వెంటనే రెండు వైపుల నడకదారులు (ఫుట్‌పాత్‌లను) నిర్మించనున్నారు. కాగా రహదారి నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈ చంద్రశేఖరశాస్త్రి, ఏఈ సీతారమేష్ తదితరులు పాల్గొన్నారు.

లైవ్ సర్టిఫికెట్ల స్వీకరణ ప్రారంభం

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల లైవ్ సర్టిఫికెట్ల స్వీకరణను ప్రారంభించినట్లు జిల్లా ఖజానా, గణాంకాల అధికారిణి లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీలలో లైవ్ సర్టిఫికెట్ల స్వీకరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ట్రెజరీ ద్వారానే కాకుండా ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ్‌లో ఎక్కడైనా సమర్పించవచ్చని, ఫోన్‌లో జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా పత్రాలు సమర్పించే సదుపాయం ఉందన్నారు. పెన్షనర్లు లైవ్ సర్టిఫికెట్లు అందజేయడంలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా దగ్గరలోని ట్రెజరీ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేశామన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారి దర్శనానికి 4గంటల సమయం

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు ఆలయంలో పలు ఆర్జిత సేవలు, మల్లన్న స్పర్శదర్శనం సేవలను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యూలలో ఎటువంటి ఇబ్బందుల కలగకుండా దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. కాగా భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించండి

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు వెంటనే పరీక్షల ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 6 వరకు గడువు ఉందన్నారు. ఈ సమయం దాటితే ఫైన్‌తో చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్ www. apopenschool.ap.gov.inను చూడాలని సూచించారు.

నకిలీ వెబ్‌సైట్లను ఆశ్రయించి మోసపోకండి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆర్జితసేవలు, స్పర్శదర్శనం టికెట్లు, అలాగే వసతి గదులు పొందేందుకు నకిలీ వైబ్‌సైట్లను ఆశ్రయించి మోసపోవద్దని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవస్థానంలో వసతిని రిజర్వు చేసుకునేందుకు, ఆర్జిత సేవలు, దర్శనం టికెట్లను ముందస్తుగా పొందేందుకు దేవస్థానం అన్‌లైన్ విధానాన్ని రూపొందించిందన్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారిక వైబ్‌సైట్ www.srisailadevasthanama.org లేదా దేవదాయశాఖ అధికారిక వైబ్‌సైట్ www.aptemples.ap.gov..inలను మాత్రమే వినియోగించాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం దేవస్థానానికి సంబంధించిన 8333901351, 8333901352, 8333901353లను సంప్రదించాలన్నారు.

ఉచిత విద్య.. మిథ్య!



- పేద పిల్లల ఉచిత కార్పొరేట్ విద్యకు ఎసరు
- ఫ్రీ సీటు అయినా ఫీజు కట్టాలంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలు
- గత ప్రభుత్వంలో విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు
- ప్రస్తుతం పట్టించుకోని కూటమి సర్కారు
- జిల్లాలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకున్నది 1,862
- 3 విడతల్లో 945 మందికి ప్రవేశం కల్పించినట్లు ప్రకటన
- అందులో 50 శాతం కూడా అడ్మిషన్లు ఇవ్వని ప్రైవేట్ విద్యాసంస్థలు
- ఇప్పుడు వారిని సైతం ఫీజుల కోసం వేధిస్తున్న వైనం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఆళ్లగడ్డ: అక్షర జ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితి మారుతుందని భావించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పైసా ఖర్చు లేని ఉచిత విద్య అందించేందుకు బంగారు బాట వేసింది. ఏటా ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరించి సీట్ల కేటాయింపు, ప్రవేశాలు పూర్తి స్థాయిలో జరిగేలా చూసింది. అయితే, ఏడు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 'పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య' పై నీలినీడలు అలుముకున్నాయి. ఈ విద్యా సంవత్సరం సీట్లు పొందిన వారితో పాటు ఈ పథకం కింద ఇప్పటికే చదువుతున్న పిల్లల తల్లిదండ్రుల నుంచి ఫీజుల వసూలుకు యాజమాన్యాలు ఒత్తిడి పెంచాయి. దీంతో తమ పిల్లలకు ఫ్రీ సీటు వచ్చిందనే ఆనందం పేదలకు కూటమి పాలనలో ఆవిరైంది.

నిబంధనలకు నీళ్లు

జిల్లాలో 314 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. 2022 – 23 విద్యా సంవత్సరం నుంచి 1వ తరగతిలో సీట్ల సంఖ్యలో 25 శాతం పేదలకు కేటాయించేలా గత ప్రభుత్వం జీవో అమల్లోకి తీసుకు వచ్చింది. ఇందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీ – 10 శాతం, ఎస్టీ – 4 శాతం, ఇతర వర్గాలకు – 6 శాతం సీట్లు కేటాయించేలా విద్యాహక్కు చట్టం అమలు చేసింది. దీంతో తొలి ఏడాది 138 మంది, 2023–24 లో సుమారు 800 మంది చేరారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో 1,862 మంది దరఖాస్తు చేసుకోగా విడతలుగా వడపోసి కేవలం 945 మందిని ఎంపిక చేశామని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉచిత విద్యపై నోరు మెదపక పోవడంతో ఈ ఏడాది చేరిన విద్యార్థులతో పాటు గత రెండేళ్లగా చేరిన విద్యార్థులను సైతం అందరిలాగా ఫీజులు చెల్లిస్తేనే ఉండాలంటున్నారు. ఈ మేరకు ఫీజు గురించి పిల్లల డైరీలో రాసి పంపిస్తున్నారు. ఉచిత విద్య అందుతుందనే ఆశతో తమ పిల్లలను చేర్పించిన పేదలు ఇప్పుడు కూటమి సర్కారు స్పందించకపోవడంతో బయట అప్పులు చేసి కట్టాల్సి వస్తుంది.




ఇక్కడ కుమారుడితో కనిపించే వ్యక్తి పేరు షేక్షావలి. డోన్ పట్టణానికి చెందిన ఇతను కుమారుడిని ప్రైవేట్ స్కూల్‌లో చదివించేందుకు ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోగా పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో సీటు కేటాయించారు. ఉబ్బి తబ్బిన షేక్షావలి వెంటనే అక్కడికి వెళ్లి అడ్మిషన్ చేయించారు. పదో తరగతి వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆనందపడుతున్న సమయంలో పాఠశాల యాజమాన్యం పిలిచి ఉచిత విద్యకు సంబంధించిన ఫీజు చెల్లింపుపై ఇంకా సర్కారు నుంచి స్పష్టత రాలేదు. కావున మీరే ఫీజు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తుందని షేక్షావలి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొర్నిపాడుకు ఈ చెందిన ఈ మహిళ వెంకటసుబ్బమ్మ. తన కొడుకు గంగారామ్‌కు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య సీటు వచ్చిందని సచివాలయ సిబ్బంది తెలపడంతో సంతోషంగా ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. పుస్తకాలు, యూనిఫాం ఇతర వాటికి కలిపి సుమారు రూ. 4,500 కట్టించుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది కదా జీఓ అమలు చేయడం లేదు. అందరు చెల్లించేలా మిగిలిన ఫీజు కూడా చెల్లించాలని పాఠశాల నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారు. తొలుత ఉచితమని చెప్పి ఇప్పుడు కట్టాలనడంతో పాలుపోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఇలా ఈ ఇద్దరే కాదు. ఉచిత విద్య కింద ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది



నంద్యాలలో ఫీజు చెల్లించాలని విద్యార్థితో తల్లిదండ్రులకు పంపిన నోటీస్

నాడు

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ – 12 (1), (సి) ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏటా 1వ తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలి. ఈ చటం పకడ్బందీగా అమలయ్యేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితంగా ధనికుల పిల్లలు మాత్రమే చదవగలిగే కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో పేదల పిల్లలు సైతం దర్జాగా అడుగు పెట్టగలిగారు. విద్యనందించినందుకు స్కూల్ యాజమాన్యాలకు ఏడాదికి అర్బన్ ఏరియాలో రూ. 8 వేలు, రూరల్‌లో రూ 6,500 ఫీజుగా నిర్ణయించారు. ఈ మొత్తం ఫీజు విద్యార్థి తల్లిదండ్రులు చెల్లించలేని పక్షంలో వారికందించే అమ్మఒడి సాయం నుంచి సర్కారు చెల్లించింది. ఫీజు పోనూ మిగిలిన సొమ్మును తల్లి ఖాతాకు జమ చేసింది. విద్యార్థి 10వ తరగతి పూర్తయ్యే వరకు యాజమాన్యాలు పుస్తకాలకు, యూనిఫాం, ట్యూషన్, స్పోర్ట్స్ పేరుతో ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా చూసుకుంది.

నేడు

నీకు పది హేను వేలు.. నీకు పది హేను వేలు.. నీకు పది హేను వేలు.. ఇలా ఒక్కో కుటుంబంలో ముగ్గురే కాదు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి 'తల్లికి వందనం' పేరుతో రూ. 15 వేల చొప్పున చెల్లిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఎడాపెడా ఊదరగొట్టి అధికారంలో కొచ్చారు. ఇప్పుడు ఆ ఊసే ఎత్తకుండా పేదలపై ఫీజుల భారం మోపుతున్నారు. పైసా ఖర్చులేకుండా పేద పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా విద్య అందించాలనే విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచారు. ఉచిత విద్యపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో పాటు 'తల్లికి వందనం'పై కూడా స్పందించక పోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఈ ఏడాది చేరిన వారితో పాటు రెండేళ్లగా ఫ్రీ అడ్మిషన్ పొందిన వారిని ఫీజులు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు.

జిల్లాలో 2024 - 25 విద్యాసంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపిక ఇలా..

మొత్తం దరఖాస్తులు: 1,862

విడతలు	ఎంపికైంది	అడ్మిషన్ అయింది
మొదటి విడత	960	736
రెండో విడత	302	201
మూడో విడత	25	17
	1287	945

ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు



ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులను ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నట్లు మా దృష్టికి కూడా వచ్చింది. ఈ విషయం జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.వారి ఆదేశాల మేరకు ఉచిత విద్యకు అడ్మిషన్లు పొందిన పిల్లలపై ఫీజులు చెల్లించాలని ఎవరైనా ఒత్తిడి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం

– జనార్దనరెడ్డి, డీఈఓ

బయటపడుతున్న సంగమేశ్వరుడు



కృష్ణాజలాల్లో కనిపిస్తున్న సంగమేశ్వరం శిఖర భాగం

శ్రీశైల జలాశయంలో నీటి మట్టం క్రమేపి తగ్గుముఖం పడుతోంది. 885 అడుగుల నుంచి 861 అడుగులకు చేరుకుంది. సప్తనది సంగమేశ్వరం సమీపంలో కృష్ణా జలాలు ఎగువ పుష్కర ఘాట్ దిగువకు వెళ్లడంతో ఆలయ శిఖర భాగం నాలుగు అడుగుల మేర బయటపడి కనువిందు చేస్తోంది. ఇదిలా ఉంటే ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, సాయంత్రం ప్రదోష పూజలు చేశారు. – కొత్తపల్లి

నేడు ఏకసభ్య కమిషన్ రాక

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల్లోని ఉప – వర్గీకరణపై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నియమించిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నేడు (గురువారం) జిల్లాకు రానుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే తులసీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిషన్ మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సమావేశం నిర్వహించి జిల్లా అధికారులు, వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో వినతి పత్రాలను స్వీకరిస్తుందన్నారు. స్వీకరించిన వినతి పత్రాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికల రూపంలో పంపుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థల్లో ఎస్సీ ఉప వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించిన వినతులను పరిశీలించడం జరుగుతుందన్నారు. అలాగే ఎస్సీ కులాల్లోని వివిధ ఉప వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా ఉన్న వెనుకబాటును పరిశీలిస్తుందన్నారు. కమిషన్‌కు వినతులు అందించే వారు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారై ఉండాలని, తమ వినతి పత్రాలపై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలకు తగు ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని డీడీ కోరారు.

చర్చల్లో పాల్గొందాం.. ప్రధానితో మాట్లాడదాం!

- పరీక్ష పే చర్చ 8వ ఎడిషన్‌కు ఆహ్వానం
- 6 వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు పాల్గొనే అవకాశం
- ఆన్‌లైన్‌లో నమోదుకు ఈనెల 14 తుది గడువు



చదువుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా.. అయితే ఆ అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. మీరు చేయాల్సిందల్లా ప్రధాన మంత్రి 'పరీక్ష పే చర్చ' యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కావడమే. ఏటా పరీక్షల ముందు 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఇప్పుడు 8వ ఎడిషన్‌కు సిద్ధమవుతుంది. దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ నేరుగా మాట్లాడుతారు. పరీక్షలను ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, వాటిపై పిల్లలకు ఉన్న భయాన్ని తొలగించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం సాగుతుంది.

ఆన్‌లైన్‌లో నమోదుకు..

మార్చి 1 నుంచి ఇంటర్, మార్చి 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఎలా సన్నద్ధమవ్వాలి. వారు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? ఎలా అధిగమించాలి? విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి? పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై' పరీక్షా పే చర్చ' జరుగుతుంది. పాల్గొనేందుకు 9 నుంచి 12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. అయితే, ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకు నమోదుకు ఈనెల 14 వరకు గడువు ఉంది.

చర్చించే అంశాలు (విద్యార్థులకు)..

మీ స్వాతంత్ర్య సమరయోధులను తెలుసుకోండి. మన సంస్కృతి, మన గర్వం, నా పుస్తకం, నా ప్రేరణ. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడండి. నా జీవితం, నా ఆరోగ్యం. నా స్టార్టప్‌కల, ఎస్‌టీఈఎం విద్య/హద్దులు లేని విద్య.

ఉపాధ్యాయుల కోసం..

మన వారసత్వం, అభ్యాస పర్యావరణాన్ని ప్రారంభించడం. నైపుణ్యం కోసం విద్య. తక్కువ కరిక్యులమ్ లోడ్ పరీక్షలకు భయం లేని వాతావరణం. భవిష్యత్తు విద్యకు సవాళ్లు.

తల్లిదండ్రుల కోసం...

నా బిడ్డ, నా గురువు. వయోజన విద్య, కలిసి నేర్చుకోవడం, పెరగడం.

ఇలా లాగిన్ అవ్వాలి ..

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లింక్‌ను క్లిక్ చేసి, మొబైల్ నంబర్ లేదా జీ-మెయిల్ ఖాతాను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. కార్యాచరణ వివరాలను పూర్తి చేసిన తర్వాత థీమ్‌ను ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్థాయిలో సైన్స్ అధికారులు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

విజేతలుగా నిలిస్తే..

ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలుసుకునే అవకాశం పొందుతారు. విజేతకు ప్రత్యేక పరీక్షా పే చర్చా కిట్, ప్రశంసా పత్రం అందజేస్తారు. విజేతలు ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను పొందే అవకాశముంది. టాప్ 10 లెజెండరీ ఎగ్జామ్ వారియర్స్ ప్రధాని నివాసాన్ని సందర్శించే అవకాశం పొందుతారు. ఈ సువర్ణ అవకాశాన్ని జిల్లాలోని 6 నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి కోరారు.

'స్మార్ట్' దోపిడీ!

- ముందుగా డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా
- ఈ మేరకు స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపేందుకు సర్కారు కుట్ర
- గత ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని బాబు పిలుపు
- అధికారంలోకి వచ్చాక మారిన విధానం
- జిల్లాలో 6 లక్షల గృహ వినియోగదారులపై పడనున్న ప్రభావం

వాడిన విద్యుత్‌కు తర్వాత నెలలో వినియోగదారులు బిల్లు చెల్లిస్తారు. ఈ చెల్లింపులో కాస్త ఆలస్యమైనా స్వల్పంగా జరిమానా పడుతుందే తప్ప వెంటనే సరఫరా నిలిచిపోదు. ఇక మీదట అలా కుదరదు. విద్యుత్ కావాలంటే ముందుగా డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సిందే. అది ఖర్చయ్యేలోగా మళ్లీ డబ్బు కడితేనే సరఫరా కొనసాగుతుంది. లేదంటే క్షణాల్లో నిలిచిపోతుంది. స్మార్ట్ మీటర్ల పేరుతో వాడుకునే కరెంటుకు ముందుగానే ప్రీపెయిడ్ విధానంలో డబ్బు వసూలు చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్లను వీటి పరిధిలోకి తెచ్చిన సర్కారు మరికొద్ది రోజుల్లో అన్ని కేటగిరీల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించనుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఇప్పుడున్న మీటర్ల ద్వారా వస్తున్న కరెంటు బిల్లులే షాక్ కొట్టే విధంగా ఉన్నాయని విద్యుత్ వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే ట్రూ అప్ చార్జీల పేరుతో కరెంటు బిల్లులు భారీగా పెంచి సర్కారు దోచుకుంటోంది. జిల్లాలోని 10.25లక్షల విద్యుత్ మీటర్లు ఉన్నాయి. నంద్యాల, ఆత్మకూరు, డోన్ డివిజన్లలోని కనెక్షన్లను డొమెస్టిక్, కమర్షియల్ పరిశ్రమలు, ప్రభుత్వ, వ్యవసాయ, ఆలయాలు, పాఠశాలలు, తాత్కాలిక విభాగాలు కలిపి మొత్తం 8 కేటగిరీలుగా విభజించారు. వాటిలో అత్యధికంగా నివాసాలకు వాడుకునే డొమెస్టిక్ కేటగిరి కింద దాదాపు 6.56 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తర్వాతి స్థానంలో సుమారు 1.10 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.



విద్యుత్ సబ్ స్టేషన్(ఇన్‌సెట్‌లో) నంద్యాలలో షాపులకు అమర్చిన స్మార్ట్ మీటర్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం

మొత్తం 8 కేటగిరీలుగా ఉన్న విద్యుత్ మీటర్లలో ప్రాధాన్యతా క్రమంలో స్మార్ట్ మీటర్లు అమర్చమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ప్రస్తుతమున్న ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ (ఐఆర్)పోర్టు మీటర్ల స్థానంలో వాటిని ఏర్పాటు చేస్తున్నారు. తొలుత జిల్లాలో కమర్షియల్ కేటగిరీలలో ఉన్న కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. తర్వాత డొమెస్టిక్, వ్యవసాయం అంటూ ప్రాధాన్యతా రంగాల వారీగా బిగించనున్నారు.ఈ ప్రక్రియ అంతా రానున్న ఐదారు నెలల్లోనే పూర్తి కానుంది.

ఎన్నో అనుమానాలు...

గతంలో ఉన్న పాత మీటర్ల ద్వారా నెలంతా విద్యుత్ వాడుకున్న తర్వాత కరెంటు బిల్లులు వస్తే ఇంట్లో డబ్బులు ఉండే వెసులుబాటును బట్టి బిల్లు చెల్లించే అవకాశం ఉండేది. ఒక వేళ కరెంటు మీటర్లకు రిపేరు వచ్చినా స్థానికంగా ఉన్న వారిని పిలిపించుకుని వెంటనే చేయించుకోవడం ద్వారా గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కారమయ్యేది. కానీ, స్మార్ట్ మీటర్లు బిగిస్తే నెల మొత్తం మీద ఎంత కరెంటు వాడుకుంటామో తెలియకుండానే ప్రీపెయిడ్ రీచార్జి పేరుతో వినియోగదారుల నుంచి ముందుగానే డబ్బు లాగేసుకునే కుట్ర జరుగుతోంది. ఒక వేళ ముందుగానే ప్రీపెయిడ్ ద్వారా రీచార్జ్ చేసుకుంటే కేటాయించిన యూనిట్లు మొత్తం వాడుకోకపోతే ఆ తర్వాత నెలకు వాడుకునే వెసులుబాటు ఉంటుందా..? లేక మధ్యలోనే రీచార్జ్ అయిపోతే మళ్లీ చేయడం ఎలా..? ఆ సమయంలో చేతిలో డబ్బు అందుబాటులో లేకపోతే ఎలా..? చీకట్లోనే మగ్గిపోవాల్సిందేనా..? అంటూ వినియోగదారుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని ఎలా పరిష్కరిస్తారో చెప్పకుండా, ప్రజలకు అవగాహన కల్పించకుండా విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్లు బిగించుకుంటూ పోవడాన్ని వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను ఆపేందుకు టూ ఇన్ వన్ మీటర్లుగా స్మార్ట్ మీటర్లు పనిచేస్తాయంటూ ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టండంటూ పిలుపునిచ్చిన కూటమి నాయకులే ఇప్పుడు వాటిని తీసుకొస్తుండటంతో ఎన్నికల ముందు ఒకలాగా అధికారంలోకి వచ్చాక మరోరకంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.


డబ్బు వసూలు సరి కాదు



ఇప్పటి వరకు కరెంటు ఎంత వాడుకున్నారో అంతకే నెల రోజుల తర్వాత బిల్లు వస్తే గడువు తేదీలోగా చెల్లించే అవకాశం ఉంది. కానీ, స్మార్ట్ మీటర్ల వలన ఎంత వాడుకుంటారో తెలియకుండానే ముందుగానే ప్రీపెయిడ్ ద్వారా వినియోగదారుల నుంచి డబ్బు గుంజుకుంటారు. దీనివలన వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉంది.

– ఎస్.రవి, ఎస్‌జీఓ కాలనీ, నంద్యాల

మీటర్లు పగలగొట్టాలన్నారు



గత ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడం కోసం ఓటర్లను ఆకర్షించేందుకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని చంద్రబాబు పిలుపునిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆయన స్మార్ట్ మీటర్లను త్వరగా ఏర్పాటు చేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అధికారంలోకి రాక ముందు ఒక రకంగా, వచ్చిన తర్వాత మరోరకంగా చెప్పడం ప్రజలను మోసం చేయడమే అవుతుంది.

–రఫీ, పీడీఎస్‌యూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ టైలరింగ్‌లో ఈనెల 16 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చినవారు అర్హులన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుదన్నారు. నాలుగు ఫొటోలు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచ్‌లో సంప్రదించాలన్నారు. మరిన్న వివరాలకు 63044 91236 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


వీరేష్(ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఎమ్మిగనూరు ఆదోని ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు మండలం పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బి.వీరేష్(36) సొంత పని నిమిత్తం స్కూటీపై ఎమ్మిగనూరు వచ్చి తిరుగు పయనమయ్యాడు. హనుమాపురం సమీపంలోకి రాగానే ఆదోని నుంచి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం స్కూటీని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో వీరేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో దూకి మహిళ గల్లంతు

కల్లూరు: హంద్రీనీవా కాలువలో దూకి మహిళ గల్లంతైన ఘటన ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని నాయకల్లు గ్రామానికి చెందిన మహిళ భారతి(21) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై హంద్రీనీవా కాలువలో దూకింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమెను కాపాడేందుకు కాలువ వెంట గాలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

కోలుకోలేక చిన్నారి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో గతనెల 22న విద్యుత్ ప్లగ్ బాక్స్ పేలిపోయి మంటలు చెలరేగి అవ్వ తిమ్మమ్మ, మనవరాలు హరితకు తీవ్రగాయాలైన విషయం విదితమే. క్షతగాత్రులను కర్నూలుకు తరలించగా అదే నెల 29న తిమ్మమ్మ మృతిచెందగా మనవరాలు హరిత(7) కోలుకోలేక బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని రుద్రాక్ష మఠం సమీపంలో ఓ యువతి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం సీఐ ప్రసాద్‌రావు చెప్పిన వివరాలు.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలం కర్రపాడు గ్రామానికి చెందిన యాలాల శ్వేత(27).. భర్త శ్రీనివాస్‌రెడ్డితో గొడవ పడి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో ఆమె మంగళవారం శ్రీశైలం చేరుకుంది. రుద్రాక్ష మఠం వద్ద నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి జారుకుంది. కాగా రంగారెడ్డి జిల్లా పోలీసులు ద్వారా సమాచారం అందుకున్న శ్రీశైలం సీఐ ప్రసాద్‌రావు, వన్ టౌన్ కానిస్టేబుల్ నాను నాయక్, హోంగార్డు ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని శ్వేతను దేవస్థానం వైద్యశాలకు తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయానికి ఆమె కోలుకోవడంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మెడికోలపై ఆకతాయిల దాడి


కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన పలువురు మెడికోలపై ఆకతాయిలు దాడి చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కొత్తబస్టాండ్ సమీపంలోని చల్లావారి వీధి వైపు వెళ్తున్న మెడికోలను మల్లికార్జున, ఆనంద్, అశోక్ అనే వ్యక్తులు దాడి చేసినట్లు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: గత ఏడాది జనవరిలో పిన్నాపురం గ్రామంలోని సోలార్ పరిశ్రమలో జరిగిన హత్య కేసు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. నిందితుడి వివరాలను బుధవారం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. బిహార్‌కు చెందిన మహ్మమద్ సద్దాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌సాగర్ సాహ్ని, రాజ్‌కిషోర్, సంత్రామ్ తదితరులు గ్రీన్ కో కంపెనీలో పనిచేసేవారు. అయితే మహ్మమద్ సద్దాబ్ మొబైల్‌లో గట్టిగా పాటలు పెడుతున్నాడని రామ్‌సాగర్ సాహ్ని, రాజ్‌కిషోర్, సంత్రామ్ కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహ్మమద్ సద్దాబ్ ఆసుపత్రిలో కోలుకోలేక మృతిచెందాడు. ఈ కేసులో నిందితులు రాజ్‌కిషోర్, సంత్రామ్‌లను పోలీసులు అప్పట్లోనే అరెస్ట్ చేయగా.. రామ్‌సాగర్ సాహ్నిని తప్పించుకుని ఉత్తరప్రదేశ్‌కు పారిపోయాడు. ప్రత్యేక టీమ్‌లను పంపించి ఉత్తరప్రదేశ్‌లోని రుపియా పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఏఎస్ఐ బాషా, ఏఎస్ఐ రఫీక్‌లను అభినందించారు.


నంద్యాల వైపు గేట్ పడటంతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం


అండర్‌పాస్‌కు వినియోగించే రింగ్ బౌండ్ల పనులు మధ్యలో నిలిచిపోయిన దృశ్యం


కర్నూలు వైపు గేట్ పడటంతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

పద్మవ్యూహంలో పాతపేట

- ఎటు పక్క వెళ్లాలన్నా ఐదు నిమిషాలకోసారి రైల్వే గేట్ల మూత
- సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యత్నం
- బుగ్గన కృషితో రెండు అండర్‌పాస్ బ్రిడ్జిల కోసం రైల్వే శాఖ రూ.10 కోట్ల మంజూరు
- అండర్‌పాస్‌ల నిర్మాణ స్థల సేకరణకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మరో రూ.2 కోట్లు
- టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిన అండర్ పాస్‌ల నిర్మాణం

మహాభారత యుద్ధంలో ఉపయోగించిన యుద్ధ వ్యూహాలలో పద్మవ్యూహం ఒకటి. ఈ వ్యూహ నిర్మాణం ఏడు వలయాలతో కూడి ఉండి శత్రువులు ప్రవేశించడానికి దుర్భేధ్యంగా ఉంటుంది. మహా భారత కురుక్షేత్ర యుద్ధంలో పాండవులను సంహరించడానికి పద్మవ్యూహం పన్నగా అందులో అభిమన్యుడు చిక్కుకుని వీరోచితంగా పోరాడి మరణిస్తాడు. డోన్ పాతపేట వాసుల పరిస్థితి కూడా అలాంటిదే. రెండు వైపులా రైల్వే గేట్లు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ఎటు వెళ్లాలన్నా ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కూడా గాల్లో కలిసిన ఘటనలూ ఉన్నాయి.

డోన్: లక్ష జనాభా కలిగిన డోన్ పట్టణ నడిబొడ్డున నంద్యా ల, కర్నూలు వైపు వెళ్లే రైళ్ల కోసం గేట్లు ఏర్పాటు చేసినందు వల్ల పట్టణం మూ డు ముక్కలుగా మారింది. దీంతో ట్రాఫిక్ సమస్య నానాటికి జటిలమైపోయింది. కొండపేట, చిగురుమానుపేట నుంచి పాతపేటకు వెళ్లాలంటే కర్నూలు రైల్వే గేట్, కొత్తపేట తదితర ప్రాంతాల నుంచి పాతపేటకు వెళ్లాలంటే నంద్యాల గేటు దాటాల్సి ఉంటుంది. రెండు రైల్వే గేట్ల మధ్య పాతపేట ఉండటంతో ఆ ప్రాంతం వాసులు ఏ వైపు వెళ్లాలన్నా రైల్వే గేట్లను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో రూ.12 కోట్లు మంజూరు

ట్రాఫిక్ సమస్య తీవ్రంగా జటిలం కావడానికి కారణమైన నంద్యాల, కర్నూలు రైల్వేగేట్ల కింద అండర్‌పాస్‌ను నిర్మించేందుకు రాష్ట్రంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం తరుపున అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేంద్రంలోని రైల్వే శాఖను ఒప్పించి రూ.10 కోట్లను మంజూరు చేయించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అండర్‌పాస్ నిర్మించేందుకు మరో రూ.2 కోట్లను విడుదల చేసి భూసేకరణ కోసం కేటాయించింది. ఈమొత్తం నిర్మాణ పనులను డోన్ - నంద్యాల రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు అప్పగించింది.


గంటలపాటు నిరీక్షించలేక ఆగిఉన్న సెంట్రింగ్ గూడ్స్‌ను ప్రమాదకరంగా దాటివెళ్తున్న దృశ్యం

ఆదిలోనే హంసపాదు

ఈ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన భూమి పూజ కూడా చేశారు. దీంతో కొంతమంది టీడీపీ నాయకులు భూసేకరణ జరగకుండా కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. దీనిమూలంగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు నిలిచిపోయాయి. భూసేకరణ అంగుళం కూడా జరగకపోవడానికి అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లే కారణమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి నిరోధకులు



ప్రస్తుత ఎమ్మెల్యే, కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా ఉన్నప్పుడు శ్రీరాముల దేవాలయం వద్ద కర్నూలు గేట్ల కింద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు నిర్ణయం తీసుకొని పదేళ్ల దాటింది. ఈ హామీ నేటికీ నెరవేరలేదు. మాజీ మంత్రి బుగ్గన ఎంతో శ్రమించి అండర్ పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే పనులు జరగకుండా అడ్డుపడటంతో టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులని తేలిపోయింది.
– శివరాం, సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు, డోన్

పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లే



పట్టణ నడిబొడ్డున రెండు రైల్వేగేట్లతో పాటు శ్రీరాముల దేవాలయం వద్ద మరో రైల్వేగేట్ ఉండటం వల్ల వివిధ గ్రామాల నుంచి పనుల కోసం వచ్చే ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాఫిక్‌లో చిక్కుకొని అనేక మంది రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. గేట్ల కింద అండర్ పాస్ నిర్మిస్తే ఒక ప్రాంతం నుంచి ఒక ప్రాంతానికి ప్రజలు సురక్షితంగా ప్రయాణం చేయవచ్చు. – వెంకటేశ్వర్లు, మల్లెంపల్లె గ్రామం

భూసేకరణ చేసి అండర్‌పాస్‌ను నిర్మించండి



అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు నిధులు మంజూరైనా రెవెన్యూ అధికారులు అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూసేకరణ జరపకపోవడం దారుణం. ఇందుకోసం రూ.2 కోట్లు రెవెన్యూ విభాగం జమచేసి ఏడాది గడిచినా వారిలో చలనం లేకపోవడం విచారకరం. నంద్యాల – డోన్ డబ్లింగ్ పనులతో పాటు డోన్‌లో రెండు రైల్వే గేట్ల కింద అండర్‌పాస్ నిర్మాణం గత ఏడాదే పూర్తి కావాల్సి ఉంది. అధికారుల అలసత్వంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడటంతోపాటు ఆపత్కాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారు. – ఆచారి, తారకరామనగర్, డోన్

నాకేమీ తెలియదు



రైల్వే గేట్ల కింద అండర్‌పాస్‌లు నిర్మించే విషయం నాకేమీ తెలియదు. ఇందుకు రింగ్‌బౌండ్‌లు నిర్మించారన్న విషయం కూడా నా దృష్టికి రాలేదు. కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టడం వల్ల భూ సేకరణ విషయంపై ఇంకా ఆకలింపు చేసుకోలేదు. తెలియని విషయంపై నేను మాట్లాడటం సమంజసంగా ఉండదు.
– నరసింహులు, ఆర్‌డీఓ, డోన్

సమాజ చైతన్య సాధనాలు నాటకాలు

- ఘనంగా ప్రారంభమైన సాంఘిక నాటకోత్సవాలు


మూల్యం నాటికలో అలరించిన సన్నివేశం

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్య సాధనాలు నాటకాలని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ అన్నారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే సాంఘిక నాటకోత్సవాలు బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సాంఘిక నాటకాలు ప్రస్తుతం సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపిస్తాయన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ నటులు సుబ్బరాయ శర్మ, గోపరాజు రమణ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడారు. అనంతరం కళా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి సన్మానంలో భాగంగా మొదటి రోజు నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి మూల్యం, గుంటూరు కొలకలూరు సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీల నాటికల ప్రదర్శన అలరించింది. ఆలోచించేలా కథా ఇతివృత్తాలు, కళాకారుల నటన ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, యాగంటీశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

నాటక రంగానికి ఆదరణ అవసరం


మాట్లాడుతున్న సినీ నటుడు సుబ్బరాయ శర్మ

కర్నూలు కల్చరల్: నాటక రంగాన్ని ఆదరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ నాటికలు, సినీ, టీవీ నటుడు యు.సుబ్బరాయ శర్మ అన్నారు. హైదరాబాద్ మహతి క్రియేషన్స్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో కర్నూలులో 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాల్లో పాల్గొనడానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నంది నాటక ఉత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తే కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తాను కర్నూలు ఆర్టీసీలో 1978లో ఉద్యోగం చేశానని, 1997లో వీఆర్‌ఎస్ ఇచ్చి పూర్తి స్థాయిలో నటన రంగం వైపు వచ్చానని తెలిపారు. మహతి క్రియేషన్స్‌తో ప్రతీ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక చోట నాటక ఉత్సవాలు నిర్వహించేవారమని, ఈ ఏడాది కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షు లు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కర్నూలు అంటేనే పౌరాణిక నాటకాలు గుర్తుకు వస్తాయన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ వినూత్న ఆఫర్లు, సర్వీసులు

- బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం జి.రమేష్


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

కర్నూలు(హాస్పిటల్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భారత సంచార నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సంస్థ వినూత్న ఆఫర్లు, సర్వీసులు ప్రకటించిందని ఆ సంస్థ కర్నూలు జనరల్ మేనేజర్ జి.రమేష్ చెప్పారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫైబర్ ఎంట్రీ క్వార్టర్లీ ప్లాన్ కింద రూ.999లతో 25 ఎంబీపీఎస్ స్పీడుతో 1200 జీబీ వరకు, ఫైబర్ ఎంట్రీ అర్ధ సంవత్సర ప్లాన్ కింద రూ.1999లతో 25 ఎంబీబీఎస్ స్పీడుతో 1300 జీబీ వరకు అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారికి అందజేస్తామన్నారు. అతి తక్కువ ధరకే అత్యధిక స్పీడు, ఓటీటీ సర్వీసులను అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్ 'ఫైబర్ బేసిక్ ఓటీటీ' ప్రవేశపెట్టిందన్నారు. కేవలం రూ.599లకే 75 ఎంబీబీఎస్ స్పీడుతో 4వేల జీబీ వరకు, ఉచితంగా డిస్నీ ప్లస్, హాట్‌స్టార్ సూపర్‌ప్లాన్ ఓటీటీ సర్వీసులను అందిస్తున్నామని చెప్పారు. ఫైబర్ నెట్ యూజర్ల కోసం 18004444 వాట్సాప్ చాట్‌బాట్ ప్రారంభించామన్నారు. బీఎస్ఎన్ఎల్‌పై వైఫై రోమింగ్ సేవలు, బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీహెచ్ నెట్‌వర్క్ ద్వారా కొత్త సర్వీసును బీఎస్ఎన్ఎల్ వైఫై సర్వీసును ప్రారంభించిందని తెలిపారు.

పేద విద్యార్థుల కోసం విద్యామిత్రం ప్లాన్

దాతలు విద్యార్థులకు లేదా ఇతర అర్హులకు వ్యక్తిగతంగా గానీ, సంస్థగా గానీ విరాళాలు ఇవ్వదలచిన వారికి బీఎస్ఎన్ఎల్ విద్యామిత్రం అనే కొత్త స్కీమ్ ప్రవేశపెట్టిందన్నారు. ఈ స్కీమ్ కింద 329 ప్లాన్ (ఫైబర్ ఎంట్రీ ప్లాన్) సంవత్సర చందాతో ముగ్గురికి విరాళం ఇస్తే రూ.11 వేలు, ఆరుగురికి విరాళం ఇస్తే రూ.21 వేలు, 10 ఇంటర్‌నెట్ కనెక్షన్లు విరాళంగా ఇస్తే రూ.35 వేలు మాత్రమే తగ్గింపు ధరలో ఇవ్వవచ్చన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, సంఘంలో పేరున్న గొప్పవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రాజేశ్వరరావు, ఐఎఫ్ఏడీ శ్రీలత, ఏజీఎం ఆపరేషన్ పి.శ్రీనివాసరావు, ఏజీఎం అడ్మిన్ వి.శ్రీను నాయక్, ఏజీఎం డోన్ జి.నారాయణస్వామి, ఏజీఎం మొబైల్ ఇన్‌స్టాలేషన్ ఎస్.చంద్రశేఖర్, ఏజీఎం ట్రాన్స్‌మిషన్ జీవి. మురళీకృష్ణ, ఏజీఎం ప్లానింగ్ వి.జాన్సన్, సబ్ డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: భ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనానికి బయలుదేరిన హైదరాబాద్‌కు చెందిన శారదాదేవి(61) బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైంది. కుటుంబ సమేతంగా కారులో శ్రీశైలానికి బయలుదేరారు. మార్గమధ్యలో అటవీ ప్రాంతంలో కోతుల గుంపును తప్పించబోయి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, శారదాదేవికి కాలు విరిగింది. సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

సైన్స్ సంబరానికి వేళాయే..

- మండల స్థాయి సైన్స్ పోటీల నిర్వహణ
- మూడు కేటగిరీల్లో ప్రాజెక్టుల ప్రదర్శన
- విజేతలకు జిల్లా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత


సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ నడుంబిగించింది. 2024–25 విద్యా సంవత్సరానికి గానూ పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు రంగం సిద్ధమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొనవచ్చు. డిసెంబర్ 31 మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల ప్రాజెక్టులు, జనవరి 3న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధిస్తాయని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 1,355 పాఠశాలలు ఉండగా వీటిలో 1,57,922 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో 140 ఉన్నత పాఠశాలల్లో 400 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా వీరంతా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు అర్హులు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో..

గత నెల 30న ఎంపిక చేసిన పాఠశాలల్లో మండల స్థాయి పోటీలు జరిగాయి. విద్యార్థి వ్యక్తిగత ప్రాజెక్టు, గ్రూప్ ప్రాజెక్టు, టీచర్ ప్రాజెక్టుల వారీగా మూడు కేటగిరిల్లో ప్రదర్శనలో పాల్గొనవచ్చు. సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి నోడల్ అధికారిగా నియామకం అయ్యారు. ఈ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్, ఎర్త్/ స్పేస్ సైన్స్, ఎన్విరాన్మెంట్, ఇంజినీరింగ్, బయో సైన్స్ / బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై పాల్గొనాల్సి ఉంటుంది. వీటిలో ఎంపికైనవారు జిల్లాస్థాయిలో జరిగే ప్రదర్శనకు అర్హత సాధిస్తారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు ఎస్పీజీ ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్నాయి. జిల్లాస్థాయి సైన్స్ అధికారిగా కేవీ సుబ్బారెడ్డి, సుందర్‌రాజులు వ్యవహరిస్తూ ఏర్పాట్లను పూర్తిచేస్తున్నారు.

సూచనలు తప్పనిసరి...

మండల, జిలాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలి. జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు పనితీరును వివరించగలిగేలా వారిని తీర్చిదిద్దాలి. సైన్స్ ప్రాజెక్టుల సందర్శన పోటీల్లో పాల్గొన్నవారు శాస్త్రీయదక్పథం, సామాజికంగా ప్రయోజనకారంగా ప్రాజెక్టులను తీర్చిదిద్దుకోవాలి. కనీస ప్రమాణాలు కలిగి, ప్రాజెక్టులు నాణ్యమైనవిగా ఉండేవిధంగా తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో థర్మా కోల్‌ను ఎట్టిపరిస్థితిల్లోనూ వినియోగించకూడదని అధికారులు చెబుతున్నారు. థర్మాకోల్‌తో తయారైనటువంటి నమూనాలను ప్రదర్శనలకు అనుమతించబోమని సైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు.

విజయవంతం చేయాలి



పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈ ఆర్టీ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికిగాను మండలస్థాయి, జిల్లాస్థాయి. పోటీల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించాం. జనవరి 3న జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయి. హెచ్‌ఎంలు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి.
– జనార్దన్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

మార్కెట్‌లోకి తాటి ముంజలు

- అధిక వర్షాల ప్రభావంతో ముందుగా కాపు
- మామిడిలో ఆఫ్ సీజన్ రకాల సాగుతో అన్‌సీజన్‌లోనూ మామిడి


కర్నూలులోని సెంట్రల్ ప్లాజా వద్ద తాటి ముంజలు అమ్మకాలు

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ప్రకృతి ప్రసాదించిన వాటిల్లో తాటి ముంజలు ప్రత్యేకమైనవి. అనేక పోషకాలున్న వీటిని వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు అమితంగా ఇష్టపడతారు. మండుటెండల నుంచి ఉపశమనం పొందేందుకు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. అయితే ఈ సారి తాటి ముంజలు నాలుగు నెలలు ముందుగా చలి కాలంలోనే మార్కెట్‌లోకి వచ్చాయి. కర్నూలు నగరంతో పాటు దాదాపు అన్ని పట్టణాల్లో 25 రోజులుగా తాటి ముంజలు కనువిందు చేస్తున్నాయి. వేసవిలో వచ్చే మామిడి కూడా నెల రోజుల నుంచే మార్కెట్‌లో కనిపిస్తోంది. కొన్నేళ్లుగా మామిడితో ఆఫ్ సీజన్ రకాల మొక్కలు నాటుకుంటున్నారు. ఆఫ్ సీజన్ రకాల్లో పునాస రాయల్ స్పెషల్ ముఖ్యమైనది. ఈ రకం ప్రాచుర్యంలో ఉండటం వల్ల అన్‌సీజన్‌లోనూ పండ్లు లభ్యమవుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో అధిక వర్షాలు కురిశాయి. ఈ ప్రభావంతో నేలలో తేమశాతం ఎక్కువగా ఉండటం వల్ల 30 శాతం తాటి చెట్లు ముందుగా పూతకు రావడంతో పాటు కాపు వచ్చాయి. వేసవిలో మామడితోపాటు తాటి ముంజలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అయితే ఈసారి చలి కాలంలో మార్కెట్‌లోకి రావడం వల్ల వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బనగానపల్లె, డోన్, పత్తికొండ, ఆలూరు ప్రాంతాల్లో తాటి వనాలు ఎక్కువగా ఉన్నాయి. కృష్ణగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పొలాల గట్ల వెంట బోర్డర్ క్రాఫ్‌గా తాటి చెట్లు పెంచారు.

గట్లపై తాటి చెట్లు నాటాం



మా పొలం గట్ల వెంట 50 తాటి చెట్లు పెంచాం. వర్షాలు ఎక్కువగా ఉండటం వల్ల నేలలో తేమ ఎక్కువై 15 చెట్లు నాలుగు నెలల ముందుగానే కాపు కాశాయి. వేసవితో పోలిస్తే చలి కాలంలో వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదు. వేసవిలో రోజుకు రూ.8,000 వరకు వ్యాపారం జరిగింది. ప్రస్తుతం రోజుకు రూ.4,000 కూడా రావడం లేదు.
– విష్ణు, అమకతాడు, కృష్ణగిరి మండలం